సాక్షి సూర్యాపేట

శనివారం । 27 । మే । 2023



మత్స్యకారులు విలవిల

నాగార్జునసాగర్ జలాశయంలో చేపల వేటకు వెళ్తున్న తీరంలోని మత్స్యకారులు ఎండలకు విలవిల్లాడుతున్నారు. - 10లో



కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

తిరుమలగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు లభించింది. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
42° / 27°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

సూర్యాపేట: జిల్లాలో జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన ఆయన వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు వచ్చే అధికారులు, జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు తమ పరిధిలో కల్పించాల్సిన వసతులు, చేయాల్సిన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీఆర్‌ఓ కిషోర్‌కుమార్, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, పేట మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, తహసీల్దార్ వెంకన్న, పోలీస్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ధాన్యం దిగుమతుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



వసుధ రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న డీఎం రాంపతి

నాగారం: ధాన్యం దిగుమతుల్లో మిల్లర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రాంపతి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని నాగారంబంగ్లా సమీపంలో ఉన్న వాసవి, వసుధ బాయిల్డ్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి, ధాన్యం దిగుమతి, ఎగుమతులపై ఆరాతీసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకొని లారీలను తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించాలన్నారు. వర్షాల నేపథ్యంలో తేమ శాతం, తాలు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. మిల్లుల సామర్థ్యం మేరకు ప్రభుత్వానికి బియ్యం అప్పగించాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'ప్రమాద బీమా'ను సద్వినియోగం చేసుకోవాలి

భానుపురి(సూర్యాపేట): రైస్‌మిల్ హమాలీలు పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉన్న రూ.399లకే రూ.10లక్షల ప్రమాదబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట హెడ్ పోస్ట్ మాస్టర్ యాదగిరి అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని అశోక పారాబాయిల్డ్‌లో హమాలీలకు ఇన్సూరెన్స్ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం 18 సంవత్సరాల నుంచి 65 ఏళ్ల వయసు వారికి వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా హమాలీ యూనియన్ నాయకులు వెంపటి గురుజీ, మిల్లు యాజమాని గుండా కృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బొజ్జ సునీల్ కుమార్, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి



మొక్కలను పరిశీలిస్తున్న డీపీఓ యాదయ్య

పెన్‌పహాడ్: మొక్కల సంరక్షణలో నర్సరీల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని డీపీఓ యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అనంతారం గ్రామంలో గ్రీన్‌డే సందర్భంగా మొక్కలకు వాటరింగ్ చేయించడాన్ని పరిశీలించి మాట్లాడారు. హరితహారం కార్యక్రమంలో నాటేందుకు పెంచుతున్న మొక్కల విషయంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. గ్రామాల్లో సేకరించే తడి, పొడి చెత్తలను వేరు చేసి కంపోస్టు ఎరువులు తయారు చేస్తూ రైతులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నివారణ చర్యలను చేపట్టడంలో గ్రామ పంచాయతీ సిబ్బంది అలసత్వం చూపవద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ నరేష్, ఏపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తుంటే విమర్శిస్తారా..?

- రెండు పంటలకు నీరిస్తున్నాం.. ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం
- కేసీఆర్ హయాంలోనే తండాలు, గ్రామాలు అభివృద్ధి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు
- కేసీఆర్ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు : విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



మఠంపల్లి : మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు, చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు

మఠంపల్లి: కోట్లాది రూపాయల నిధులు విడుదల చేస్తూ తండాలు, గ్రామాల్లో అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కిస్తుంటే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అన్యాయంగా విమర్శిస్తున్నారన్నారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం మఠంపల్లి మండల కేంద్రంలో గల శ్రీలక్ష్మీనరసింహ ఫంక్షన్‌హాల్‌లో హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. తనతోపాటు మంత్రి జగదీశ్‌రెడ్డి మలిదశ తెలంగాణ ఉద్యమంలో పదవులకు రాజీనామాలు చేయడమేగాక ఏళ్ల తరబడి రాత్రులు నిద్రలేకుండా గడిపి కేసీఆర్ నాయకత్వంలో స్వరాష్ట్రాన్ని సాధించామన్నారు. తెలంగాణ సాధించాక రెండు పంటలకు సరిపడా సాగునీరు, 24గంటలు విద్యుత్ సరఫరా చేస్తూ, ఐదేళ్లలో లక్షా ఏభైదివేల ఉద్యోగాలు భర్తీచేశామని, ప్రస్తుతం మరో 80వేల ఉద్యోగాలు ఇవ్వబోతున్నామన్నారు. వైద్య కళాశాలలు, బంజారా భవన్‌లు, ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేశామన్నారు.

కేసీఆర్ సీఎం అయ్యాకే సంక్షేమ ఫలాలు

మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ సీఎం అయిన తరువాతనే ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందుతూ మేలు జరుగుతోందన్నారు. మంత్రి హరీష్‌రావు సహకారంతో నాగార్జునసాగర్ లోలెవల్ కెనాల్ పూర్తిచేశామన్నారు. పులిచింతల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జిల్లాను ఎడారిగా మార్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. తెలంగాణ వచ్చిన తరువాత వరుసగా 16 పంటలకు సాగర్‌నీరు ఇచ్చామన్నారు. నేడు ధాన్యం దిగుబడిలో జిల్లా రికార్డు సృష్టించిందన్నారు. సమస్యలు కాంగ్రెస్ తెస్తే బీఆర్‌ఎస్ పరిష్కరించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కరరావు, బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య, ఎంపీపీ పార్వతికొండానాయక్, మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, శంకరమ్మ,, మాజీ ఎంపీపీలు లక్ష్మీ వెంకటనారాయణ, కొండానాయక్, శ్రీనివాస్‌గౌడ్, పిచ్చయ్య, కృష్ణంరాజు,లక్ష్మీనరసింహరాజు, హఫీజ్‌ఖాన్, సునీతాలులునాయక్ ప్రజాప్రతినిదులు,నాయకులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో మంత్రుల పూజలు



ఆలయ ముంపు ఫొటోలు పరిశీలిస్తున్న మంత్రులు హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డి

మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని శుక్రవారం రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో పూజలుచేసిన మంత్రులను శేషవస్త్రాలతో సత్కరించారు. పులిచింతల వెనుక జలాల కారణంగా ముంపుకు గురైన నాటి ఆలయ ఫొటోలను అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్‌లు మంత్రులకు చూపించారు. అక్కడినుండి మఠంపల్లికి చేరుకున్నారు. ఇక్కడ శ్రీకాంతాచారి, తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికంగా రైతు వేదికను ప్రారంభించి భారీ ర్యాలీతో సభాప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ సీతారామయ్య, పలువురు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి మంత్రుల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

'మిర్యాలగూడ'లో..

మిర్యాలగూడ: బీఆర్‌ఎస్ హయాంలోనే మిర్యాలగూడ దశాదిశ మారిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ నియోజకవర్గంలో నిర్వహించిన ఆయా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎన్‌ఎస్పీ క్యాంపులో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీష్‌రావు మాట్లాడారు.

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట



పొనుగోడులో పల్లె దవాఖానా పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీష్‌రావు

గరిడేపల్లి: తెలంగాణలో వైద్యరంగానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో చేపడుతున్న పల్లె దవాఖానా నిర్మాణ పనులకు మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని రాయినిగూడెంలో రూ.12 లక్షల వ్యయంతో చేపట్టిన పల్లె దవాఖానాను వారు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. తమకు పే స్కేల్ అందించాలని ఉపాధిహామీ ఉద్యోగులు, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని వీఆర్‌ఏలు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ తోపాటు స్థానిక ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజరవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, పొనుగోడు, రాయినిగూడెం సర్పంచ్‌లు జోగు సరోజనిపిచ్చిరెడ్డి, దోసపాటి భిక్షం, మండల పార్టీ అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్, ఎంపీటీసీ రామ్ సైదులు, జోగు అరవింద్‌రెడ్డి, వెంకటరమణ, పూజారి నర్సింహాచార్యులు, తహసీల్దార్ కార్తీక్, ఎంపీఓ మౌలానా, ఏపీఓ మౌలానా, ఎంపీఓ సురేష్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



నేరేడుచర్ల : రాంపురంలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రులు హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డి

నేరేడుచర్ల: పేదల ఆరోగ్యానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం భరోసా ఇస్తుందని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రాంపురంలో రూ.13లక్షల వ్యయంతో నిర్మించిన బస్తీ దవాఖానానుమంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రూపాయి ఖర్చు లేకుండా పేద ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పల్లె, బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా పాలకవీడు మండలంలో రోఫ్రా చట్టం ప్రకారం అటవీ భూములపై అర్హులైన గిరిజనులకు హక్కు పత్రాలను ఇవ్వాలని ఆ మండల జెడ్పీటీసీ మాలోతు బుజ్జిమోతీలాల్ మంత్రి హరీష్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు కలెక్టర్ వెంకట్రావ్, ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, పాలకవీడు ఎంపీపీ భూక్యా గోపాల్, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా శ్రీలతారెడ్డి, ఆర్డీఓ వెంకారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ శంకరయ్య, కౌన్సిలర్లు ఎస్‌కే. బాషా, అలక సరితసైదిరెడ్డి, తాళ్లూరి సాయి, వేమూరి నాగవేణి, కె.సరిత, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో 'పేట' విద్యార్థుల సత్తా

- ఎంపీసీ స్ట్రీమ్‌లో 2,525.. ఎంబైపీసీలో 2,550 మంది ఉత్తీర్ణత
- ఎంపీసీలో శరణ్య, సిద్ధిఖ్ స్టేట్ ఫస్ట్, సెకండ్ ర్యాంకులు కైవసం
- ఎంబైపీసీలో వరుసగా 2, 3, 4 ర్యాంకులు సాధించిన విద్యార్థులు



ఎస్.శరణ్య, స్టేట్ ఫస్ట్ ర్యాంక్



ఎస్‌కే.సిద్ధిఖ్, సెకండ్ ర్యాంక్



ఎం.అక్షయతార, సెకండ్ ర్యాంక్

సూర్యాపేట టౌన్: ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన పాలిసెట్–2023 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటుకున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 3,004 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఎంపీసీ స్ట్రీమ్ విభాగంలో 2,525 మంది, ఎంబైపీసీ స్ట్రీమ్‌లో 2,550మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ స్ట్రీమ్‌లో 1,309 మంది బాలురు, 1,216 మంది బాలికలు క్వాలిఫై అయి 84.05శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఎంబైపీసీ స్ట్రీమ్‌లో 1,314 మంది బాలురు, 1,236 మంది బాలికలు పాసై క్వాలిఫై అయి 84.89శాతం ఉత్తీర్ణత సాధించారు. అయితే ఈ పాలిసెట్‌లో బయో సైన్స్ పేపర్ రాసిన వారిని ఎంబైపీసీగా, రాయని వారిని ఎంపీసీ స్ట్రీమ్ విభాగాలుగా విభజిస్తారు. ఇందులో కొందరు విద్యార్థులు రెండు విభాగాల పరీక్ష రాసి రెండు విభాగాల్లోనూ ర్యాంకులు సాధించారు.

టాప్–5లో పేట విద్యార్థులు..

సూర్యాపేటకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి టాప్–5లో నిలిచారు. సూర్యాపేటకు చెందిన సిటీ టాలెంట్ పాఠశాల విద్యార్థులు ఎంపీసీ స్ట్రీమ్‌లో ఎస్.శరణ్య 120 మార్కులకు గాను 119 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఎస్‌కె.సిద్ధిఖ్ 116మార్కులు సాధించి స్టేట్ 2వ ర్యాంకు సాధించారు. సృజన స్కూల్‌కు చెందిన ఎం అక్షయతార ఎంబైపీసీ స్ట్రీమ్‌లో 116 మార్కులు సాధించి స్టేట్ 2వ ర్యాంకు సాధించింది. జయ పాఠశాలకు చెందిన కె.శశివర్ధన్ ఎంపీసీ స్ట్రీమ్‌లో 118 స్టేట్ 3వ ర్యాంకు, కె.ఉజ్వన్ ఎంబైపీసీలో 116 మార్కులతో స్టేట్ 4వ ర్యాంకులు సాధించారు.

సివిల్స్ సాధించడమే లక్ష్యం

నాకు పాలిసెట్‌లో ఫస్ట్ ర్యాంకు రావడానికి ఉపాధ్యాయుల కృషి, తమ తల్లిదండ్రుల ప్రోత్సహం ఎంతగానో ఉంది. భవిష్యత్‌లో ఐఏఎస్ సాధించడమే నా లక్ష్యం. పేద ప్రజలకు సేవ చేసేందుకు కలెక్టర్ కావాలనేది నా డ్రీమ్. ప్రస్తుతం ఐఐటీలో సీటు సాధించి బీటెక్ పూర్తి చేసి సివిల్స్ వైపు వెళ్తా.

– ఎస్.శరణ్య, స్టేట్ ఫస్ట్ ర్యాంకర్, సూర్యాపేట

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి రాజగోపాల్

చివ్వెంల(సూర్యాపేట): ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జ్యూడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా డి.మధుసూదన్‌రావు, అసోషియేట్ అధ్యక్షుడిగా ఎ.సంజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా సైదానాయక్, శ్రీకాంత్, శ్వేత, ప్రధాన కార్యదర్శిగా జి.బ్రహ్మారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మోహిన్‌అలీ. జాయింట్ సెక్రటరీలుగా ఆంజనేయులు, శ్రీకాంత్ రెడ్డి, మల్లేశ్వరి, జునైద్ అహ్మద్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి పాల్గొన్నారు.

- రెండో రోజు ఉత్కంఠభరితంగా..



సూర్యాపేటలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు శుక్రవారం రెండో రోజు ఉత్కంఠభరితంగా కొనసాగాయి

ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

నల్లగొండ టూటౌన్ : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన జిల్లాస్థాయి స్టడీ సర్కిళ్లలో గ్రూప్స్, రైల్వే, బ్యాంకు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల శిక్షణ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల వివరాలను http//:tsstudycircle.co.in నందు ఉంచినట్లు పేర్కొన్నారు. రిజర్వేషన్లతో కూడిన ఎంపిక జాబితాను సంబంధిత షెడ్యూల్ కులాల కార్యాలయంలో, స్టడీ సర్కిల్ డైరెక్టర్లకు, అభ్యర్థుల వాట్సప్‌కు, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు.



బంద్‌తో బోసిబోయిన తెలంగాణ చౌరస్తా

తిరుమలగిరి బంద్ ప్రశాంతం

తిరుమలగిరి (తుంగతుర్తి): తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం తిరుమలగిరి పట్టణంలో అఖిలపక్ష నాయకుల చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. అఖిలపక్ష నాయకులు ఉదయమే బైక్‌లపై ర్యాలీ నిర్వహించి వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూసి వేయాలని కోరారు. దీంతో వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మధ్యాహ్నం వరకు మూసివేసి అనంతరం తెరిచారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాకు పెద్ద ఎత్తున పోలీసులు చేరుకొని అక్కడ ఉన్న అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేసి సూర్యాపేట, ఆత్మకూరు(ఎస్), నూతనకల్, తుంగతుర్తి, అర్వపల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టయిన వారిలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుకూరి సోమయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, వై.ధీన్‌దయాళ్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పందుల శ్రవణ్‌కుమార్, బొడ్డు కిరణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, జమ్మిలాల్, భాస్కర్, వీరేష్, కృష్ణ, శ్రీనివాస్, లక్ష్మణ్, జింకయ్య, శోభ తదితరులు పాల్గొన్నారు.



నాయకులను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు



సూర్యాపేట రూరల్ స్టేషన్‌లో తిరుమలగిరి కాంగ్రెస్ నాయకులు

అన్ని శాఖలకు ఉపయోగపడేలా..

- రైతు వేదికలను నిరంతరం వినియోగించేలా ప్రభుత్వం చర్యలు
- ఇప్పటి వరకు కేవలం రైతు సదస్సులకే పరిమితం
- ఇకనుంచి వివిధ డిపార్ట్‌మెంట్ల సమావేశాలకు కేటాయింపు
- తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన వ్యవసాయ శాఖ




హుజూర్‌నగర్‌లోని రైతు వేదిక

హుజూర్‌నగర్: గ్రామాల్లో నిర్మించిన రైతు వేదికల్లో ఇకనుంచి అన్ని శాఖలకు సంబంధించిన సమావేశాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేలా ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీంతో జిల్లాలో నిర్మించిన రైతు వేదికలు అన్ని ప్రభుత్వ శాఖల కార్యక్రమాలకు వేదికలుగా మారనున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతు వేదికలు కేవలం వ్యవసాయ శాఖ సమావేశాలు, రైతులకు అవగాహన కార్యక్రమాలు మాత్రమే నిర్వహిస్తున్నారు. అది కూడా రెండు మూడు నెలలకు ఒకసారి, లేదా వానాకాలం సీజన్ మొదట్లో సమావేశాలు నిర్వహించడం అటు తరువాత మళ్లీ యాసంగి సీజన్‌లో ప్రారంభంలో మాత్రమే సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఆ తర్వాత వాటి తలుపులు కూడా తెరిచే వారు ఉండడం లేదు. ఈ నేపథ్యంలో వాటిని నిరంతరం వినియోగంలోకి తెచ్చేందుకు, రైతు వేదిక క్లస్టర్ పరిధిలోని విస్తరణ అధికారులు ఎల్లప్పుడు అక్కడే అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో పాటు వ్యవసాయ శాఖ తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పరిధిలోని 42 శాఖలకు వారి కార్యక్రమాలు క్లస్టర్ స్థాయి సమావేశాలకు రైతు వేదికలు ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. దీంతో రైతు వేదికలు ఇకనుంచి అన్ని ప్రభుత్వ శాఖల కార్యక్రమాలకు ఉపయోగపడనున్నాయి.

మొత్తం 82 రైతు వేదికలు..

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 23 మండలాలు ఉన్నాయి. వాటిలో 475 గ్రామాలు ఉండగా వ్యవసాయ శాఖ 5 వేల ఎకరాల విస్తీర్ణానికి ఒక క్లస్టర్ చొప్పున ప్రభుత్వం 82 క్లస్టర్లుగా విభజించింది. ఒక్కో క్లస్టర్‌కు రూ.22లక్షల వ్యయంతో ఒక రైతు వేదిక చొప్పున 82 రైతు వేదికల నిర్మాణం చేపట్టింది. వాటిలో 79 రైతు వేదికలు నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. ఒకటి కోర్టు కేసు వల్ల నిర్మాణం నిలిచిపోగా మరో రెండు నిర్మాణ పనులు తదిదశ చేరాయి. అయితే చాలా క్లస్టర్లల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేక గ్రామాలకు దూరంగా నిర్మించారు. మైకులు, కుర్చీలు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించారు. వాటి నిర్వహణ కోసం ప్రతినెలా ప్రభుత్వం రూ.9 వేలు ఇస్తోంది. వీటిలో మండల కేంద్రాల్లోని రైతు వేదికలు మాత్రం కొంత వరకు వినియోగంలో ఉన్నాయి. గ్రామాల్లో నిర్మించిన వాటిల్లో సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. ఏటా భూసార పరీక్షల కోసం సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులకు సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అయితే భూసార పరీక్ష సామగ్రి వచ్చినా వాటికి అవసరమయ్యే రసాయనాలను మాత్రం సరఫరా చేయలేదు. దీంతో భూసార పరీక్ష కిట్లు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ నుంచి వచ్చిన తాజా ఉత్తర్వులతో రైతు వేదికలు అన్ని ప్రభుత్వ శాఖల సమావేశాలకు, కార్యక్రమాలకు వేదిక కానున్నాయి.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి



రైతు వేదికల వినియోగం విషయంలో ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఇక నుంచి వివిధ ప్రభుత్వ శాఖల సమావేశాలు, ఇతర కార్యక్రమాలను రైతు వేదికలలో నిర్వహించుకోవచ్చు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వ శాఖల సమావేశాలు, కార్యక్రమాల నిర్వహణ గురించి వ్యవసాయ శాఖను సంప్రదించి ఆయా వివరాలను అందిస్తే వాటికి అనుగుణంగా వేదికను కేటాయించేలా చర్యలు తీసుకుంటాం.

– డి.రామారావు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

క్లుప్తంగా

బాలికపై అత్యాచారయత్నం

పెద్దవూర : బాలికపై ఓ బాలుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పెద్దవూర మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ తండాకు చెందిన బాలికను అదే మండలం మరో తండాకు చెందిన బాలునికి కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని ఆసరాగా తీసుకుని సదరు బాలుడు మాయమాటలతో బాలికను శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఇదే క్రమంలో గురువారం రాత్రి సదరు బాలిక ఇంటికి రావడంతో ఆ బాలిక గట్టిగా కేకలు వేసింది. కుటుంబ సభ్యులు మేల్కొనడంతో బాలుడు పరారుకాగా ఈ విషయ వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు బాలుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం నల్లగొండ ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు.

యాదాద్రి ఘాట్‌రోడ్డుపై నాగుపాము ప్రత్యక్షం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వెళ్లే దారిలోని మొదటి ఘాట్ రోడ్డుపై నాగుపాము ప్రత్యక్షమైంది. స్థానిక భక్తులు, ఎస్‌పీఎఫ్, హోంగార్డు సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో మొదటి ఘాట్‌రోడ్డు నుంచి కొండపైకి వెళ్లే మార్గంలో ఉన్న జీయర్ కుటీర్ సమీపంలోని ప్రధాన రహదారిపైకి నాగుపాము వచ్చింది. గమనించిన భక్తులు, పోలీస్ సిబ్బంది భయాందోళన చెందారు. ఆ సమయంలోనే ఓ వాహనం అటువైపు వెళ్తుంటే పాము ఒక్కసారిగా పడగ విప్పి కూర్చుంది. సుమారు 30నిమిషాల పాటు అలాగే ఉంది. సుమారు అర్ధగంట తర్వాత నాగుపాము పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లింది.

ఎండలకు మత్స్యకారులు విలవిల

- వలకు చేపలు చిక్కక ఉపాధి భారం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

నాగార్జునసాగర్: మండుటెండలకు నాగార్జునసాగర్ జలాశయ తీరంలోని మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు. వలకు చేపలు చిక్కక పస్తులుండే పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. భానుడి ప్రతాపానికి జలాశయంలోని నీరు విపరీతంగా వేడెక్కుతుండడంతో చేపలు నీటి పైకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర పడవలలో పుట్టీలను వేసుకొని జలాశయం లోపలికి వెళ్లి చేపలు పట్టే పరిస్థితి నెలకొందని మత్స్యకారులు అంటున్నారు. గతంలో పుట్టీల్లోనే జలాశయంలోకి వెళ్లేవారమని నేడు ఆ పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. జలాశయం తీరం వెంట సుమారు 10వేల మత్స్యకారుల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరిలో డ్యాం నిర్మాణ సమయంలో ఇక్కడికి వచ్చి స్థిరపడిన కుటుంబాలే ఎక్కువ. వీరితో పాటు జలాశయ తీరం వెంట స్థానికంగా ఉన్న గ్రామాలు, తండాలవాసులు బతుకుదెరువు కోసం మత్స్యకారులుగా మారారు. ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉండటంతో చేపలు నీళ్ల లోపలే ఉంటున్నాయని పైకి రాకపోవడంతో వలకు చిక్కడం లేవని మత్స్యకారులు వాపోతున్నారు. ఉదయం 10గంటల నుంచే ఎండ వేడిమి పెరుగుతుండటంతో తీరం వెంట పుట్టీల కిందనే ఉంటున్నామని తెలిపారు. చేపలు పట్టి అమ్ముకునే తమకు విక్రయించడానికి చేపలు లేక పస్తులుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు తగ్గితే తప్ప జలాశయంలోకి వెళ్లలేమని, వడగాల్పులకు పుట్టీల కింద కూడా ఉండలేకపోతున్నామని మత్స్యకారులు అంటున్నారు. మత్స్యకారులను ప్రభుత్వమే ఆదుకోవాలని మత్స్యకార సంఘాలు కోరుతున్నాయి.



నది తీరాన ఉన్న పడవలు

బియ్యం, నగదు అందజేయాలి



మత్స్యకారుల కుటుంబాలకు వేసవిలో చేపలు దొరకడం కష్టంగా మారింది. వేసవిలో పొట్టపోసుకోవడానికి ప్రభుత్వం అదనపు బియ్యం ఇవ్వాలి. రోజువారి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.3వేలు ఇవ్వాలి.

– కోదండం, మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు



సాగర్ జలాశయం తీరంలో పుట్టీల కింద ఉన్న మత్స్యకారులు



చేపలు పట్టేందుకు పుట్టీపై నదిలోకి వెళ్తున్న మత్స్యకారులు



చేపలు పట్టేందుకు వల విసురుతున్న మత్స్యకారులు

● కలెక్టర్.. రాక్ క్లైంబింగ్



యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి భువనగిరి ఖిలాపై రాక్ క్లైంబింగ్ చేశారు. ఇటీవల తన కుమారుడుతో కలిసి ఖిలా వద్దకు వెళ్లారు. కుమారుడు జిప్‌లైన్ చేయగా కలెక్టర్ రాక్ క్లైంబింగ్ చేశారు. ఆ ఫొటోలు కలెక్టర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుచేశారు. అవి శుక్రవారం బయటకు వచ్చి వాట్సప్‌లలో చక్కర్లు కొట్టాయి. – భువనగిరి

మంత్రుల పర్యటనలో కార్యకర్తకు గాయాలు

- బీఆర్ఎస్ కార్యకర్త కాలుపైకి ఎక్కిన దేవరకొండ ఎమ్మెల్యే కారు

మిర్యాలగూడ అర్బన్ : మంత్రుల పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. శుక్రవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో మంత్రులు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో కాన్వయ్‌లోని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రనాయక్ కారు మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చిట్యాల సైదయ్య కాలుపైకి ఎక్కింది. వెంటనే గట్టిగా అరవడంతో కారును ఆపిన డ్రైవర్ వెనకకు తీశాడు. కాలికి గాయం కావడంతో తోటి కార్యకర్తలు వెంటనే ఆస్పత్రిలోకి తీసుకెళ్లారు. ప్రమాదం జరిగినా ఎమ్మెల్యే కారు దిగకుండా వెళ్లిపోవడంపై అక్కడున్న కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.



గాయపడిన కార్యకర్తను ఆస్పత్రికి తీసుకెళ్తున్న తోటి కార్యకర్తలు

కడుపునొప్పి భరించలేక..

- వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

రాజాపేట : కడుపునొప్పి భరించలేక వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. కోదాడ, రాజాపేట మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపేట మండలంలోని సోమారం గ్రామానికి చెందిన తమ్మడి శ్రీనివాసులు, పద్మల పెద్దకుమారుడు సిద్దులు (26) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కూడా సిద్దులుకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. అనంతరం విషయాన్ని తమ్ముడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి భువనగిరి ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

చెట్టుకు ఉరేసుకుని..

కోదాడరూరల్ : అనంతగిరి మండలం బొజ్జగూడెం గ్రామానికి చెందిన భుక్య బంద్యా(70) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. దీనికి తోడు అతని భార్య ఆరోగ్యం కూడా బాగోలేదు. కుటుంబ సమస్యలు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి అతను పనిచేస్తున్న కోదాడ పట్టణంలోని పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేసే దుకాణంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం పక్కన పండ్ల వ్యాపారం చేసే వ్యక్తి గమనించి షాపు యజమానికి సమాచారం ఇచ్చాడు. అతను సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడకు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

హరీశ్‌రావుకు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల వినతి

మిర్యాలగూడ అర్బన్: పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం మిర్యాలగూడకు వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావుకు ఆరోగ్యశ్రీ సిబ్బంది (ఆరోగ్యమిత్ర)లు వినతిపత్రం అందచేశారు. కనీస వేతనం రూ. 28 వేలు ఇవ్వడంతో పాటు టీఏ, డీఏ కల్పించాలని, ఆరుగంటల పనిదినాన్ని అమలు చేసి, ఆస్పత్రులకు వచ్చే డబ్బులలో ఆరోగ్యమిత్రలకు ప్రోత్సాహక పర్సంటేజీలు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డుల సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో కోరారు.



హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్య మిత్రలు

హత్య కేసులో ముగ్గురిపై కేసు

గుర్రంపోడు : మండంలోని కొప్పోలులో గురువారం జరిగిన యువకుడు బొడ్డు సంతోష్ హత్య కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. దాడికి పాల్పడిన బాలిక తండ్రి ఆవుల మల్లయ్య, నాయినమ్మ రాములమ్మ, బంధువు ఆవుల నగేష్‌లపై మృతుడి బాబాయి వనం నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కాగా, కట్టంగూర్ మండలం దుగినెల్లి గ్రామానికి చెందిన సంతోష్ తల్లిదండ్రులు సైదులు రేణుకలు శుక్రవారం ఉదయం సూరత్ నుంచి నల్లగొండ ఆస్పత్రికి చేరుకున్నారు. విగతజీవిగా మారిన కుమారుడిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించడంతో వారు స్వగ్రామానికి వెళ్లిపోయారు. పూర్తిస్థాయిలో బంధువులు రాకపోవడంతో అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

సంస్థాన్ నారాయణపురం : తాటి చెట్టు పైనుంచి కిందపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం సంస్థాన్‌నారాయణపురంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు నీళ్ల నర్సింహ(70) రోజు మాదిరిగానే కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కల్లు తీసే ప్రయత్నంలో ప్రమాదశాత్తు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి అయినా నర్సింహ ఇంటికి రాకపోవడంతో తాటివనాల్లో వెతకగా అప్పటికే మృతిచెందాడు.

రెస్టారెంట్‌లో కుళ్లిపోయిన చికెన్ పట్టివేత

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని హ్యాండ్లూమ్‌మార్కెట్‌లోని గ్రీన్ బకెట్ రెస్టారెంట్‌లో శుక్రవారం మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వినియోగానికి వంటిగదిలో ఉంచిన కుళ్లిపోయిన చికెన్‌ను పట్టుకున్నారు. అదే విధంగా పాడైపోయిన చికెన్‌ను పక్కనే ఉన్న డ్రెయినేజీలో సైతం కలుపుతున్నట్టుగా గుర్తించారు. వీటితోపాటు రెస్టారెంట్ పరిసరాల్లో అపరిశుభ్రంగా ఉండడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెస్టారెంట్ యజమానికి రూ.5వేల జరిమానా విధించారు.

గాయపడిన యువకుడు మృతి

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ నెల 24న ఆలేరు వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం మండల పరిధిలోని రాయగిరి సమీపంలో రెండు దిచక్రవాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న జావిద్, యాసిన్, కేతన్, గణేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కేతన్ (21)శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

తిరుమలగిరి పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు లభించింది. ఈ మేరకు శుక్రవారం అధికారికంగా ప్ర కటించినట్లు కళాశాలకు సమాచారం అందించారు. తిరుమలగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళా శాలను ఎన్‌బీఏ బృందం ఇటీవల మూడు రోజుల పాటు పరిశీలించి కళాశాలలో సదుపాయాలు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, లెక్చరర్ల పనితీరు, హాస్టల్ నిర్మాణ, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా వసతులను పరిశీలించా రు. ఇందులో వెయ్యి మార్కులకు గాను 600 మార్కులకు పైగా సాధించడంతో సివిల్ ఇంజ నీరింగ్ విభాగానికి 2023 నుంచి 2026 సంవత్సరం వరకు ఎన్‌బీఏ గుర్తింపు లభించింది. కళాశాలకు గుర్తింపు లభించడం పట్ల ప్రిన్సి పాల్ రవీందర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

చివ్వెంల (సూర్యాపేట) : భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవితఖైదుతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం హట్యాతండాకు చెందిన సరోజకు పెన్‌పహాడ్ మండలం జల్మాల్‌కుంట తండాకు చెందిన నునావత్ స్వామితో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2020 సంవత్సరంలో ఏప్రిల్ నెలలో స్వామి తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అనుమానిస్తూ తండ్రి నునావత్ బీక్యాను హత్య చేశాడు. అనంతరం మూడు నెలల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి అదే సంవత్సరం ఆగస్టు నెలలో రాత్రి 11.30 గంటల సమయంలో నిద్రిస్తున్న భార్యపై గొడ్డలితో దాడి చేసి కడతేర్చాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి అడిషినల్ పీపీ కాకి రాంరెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి జీవితఖైదుతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధించారు. పీపీకి లైజన్ ఆఫీసర్ సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు సహకరించారు.

ట్రాక్టర్ కిందపడి విద్యార్థి మృతి



జీవన్ (ఫైల్)

నల్లగొండ క్రైం : ట్రాక్టర్ కిందపడి ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దొమలపల్లి గ్రామానికి చెందిన నర్సింహ కుమారుడు జీవన్ అలియాస్ మల్లికార్జున్ (15) 8వ తరగతి పూర్తి చేశాడు. వేసవి సెలవుల్లో తండ్రికి వ్యవసాయం చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. మధ్యాహ్నం జీవన్ వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. తండ్రి భోజనానికి ఇంటికి వెళ్లగా జీవన్ ట్రాక్టర్‌తో భూమిని దున్నుతున్నాడు. ఈ క్రమంలో భూమి ఎగుడుదిగుడుగా ఉండడంతో ట్రాక్టర్ అదుపుతప్పింది. ఈ క్రమంలో జీవన్ ట్రాక్టర్ పైనుంచి కిందికి దూకబోగా అతడి కాలు బ్రేక్ మధ్యలో ఇరుక్కుపోయింది. ఈ క్రమంలో తలకిందులుగా వేలాడుతున్న జీవన్ పైనుంచి ట్రాక్టర్ వెనుకటైరు ఎక్కింది. దీంతో అతడు గాయపడడంతో పాటు ఊపిరి ఆడక మృతిచెందాడు. సమీప రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి వచ్చి బోరున విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మూగజీవి యాతన

- గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదెకు గాయాలు
- వైద్యం చేయించి, సపర్యలు చేస్తూ కాపాడుతున్న హోటల్ యజమాని

నిడమనూరు : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ సూడి గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. లేవలేని స్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. గేదె దీనస్థితిని చూసి ఓ హోటల్ యజమాని దానికి చికిత్స చేయించి సంరక్షిస్తున్నాడు. రోడ్డు వెంట వెళ్తున్న వారు గేదె పరిస్థితిని చూసి అయ్యో పాపం అంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిడమనూరు మండలం నార్లగూడ మేజర్ సమీపంలో ఇటీవల గుర్తుతెలియని వాహనం గేదెను ఢీకొట్టి వెళ్లిపోయింది. మరుసటి రోజు సమీపంలోని ఓ హోటల్ యజమాని నరేంద్ర గమనించాడు. గేదె పడుతున్న అవస్థ చూసి రోడ్డు పక్కన చెట్టునీడకు జరిపించాడు. బంకాపురం గోపాల మిత్ర నాగయ్యను రప్పించి వైద్య సేవలు అందిస్తున్నాడు. గడ్డి వేసి, నీళ్లు పెట్టి ఎండ తగలకుండా చర్యలు తీసుకుంటూ ఆ మూగజీవిని కాపాడుతున్నాడు. వారం రోజులవుతున్నా గేదె కోసం ఎవరూ రాలేదని, మూగజీవి అవస్థ చూడలేక సేవ చేస్తున్నట్లు నరేంద్ర తెలిపారు.



చెట్టుకింద సేదదీరుతున్న గేదె

● శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు



మిర్యాలగూడలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రజలు



వేములపల్లిలో గ్రామపంచాయతీ భవనం ప్రారంభిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు



మట్టపల్లి ఆలయానికి వస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి



మిర్యాలగూడలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రులు



మిర్యాలగూడలో పీడీయాట్రిక్ వార్డు ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యే



మహిళలతో సెల్ఫీ దిగుతున్న మంత్రి హరీశ్‌రావు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



సత్తయ్య (ఫైల్)

రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన ఓ కౌలు రైతు అప్పుల బాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నీర్నేముల గ్రామానికి చెందిన కడారి సత్తయ్య (65) రామన్నపేట శివారులో ఏడు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని నాలుగేళ్లుగా సాగు చేస్తున్నాడు. రెండేళ్ల నుంచి కాలం కలిసి రాక దిగుబడులు తగ్గి కౌలు కోసం, పెట్టుబడి నిమిత్తం చేసిన అప్పులు తీరలేదు. కొద్దిరోజులుగా అప్పులు తీర్చేదెట్లా అని దిగులు చెందుతున్నాడు. ఈ క్రమంలోనే మనస్తాపం చెందిన సత్తయ్య ఈనెల 25న మధ్యాహ్నం కౌలు చేస్తున్న పొలం వద్దకు వెళ్లి మడికట్లలో ఉన్న చెత్తను తగులబెట్టి ఇంటికి వచ్చాడు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూంలో ఉరివేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.